క్లుప్తంగా

కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం

ఏలూరు (టూటౌన్): పెదవేగి మండలం వంగూరు పంచాయతీ పరిధిలోని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ కార్మికులకు – యాజమాన్యానికి మధ్య వేతన ఒప్పందం జరిగింది. ఏలూరులోని అశోక్ నగర్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో డీసీఎల్ శ్రీనివాస్ సమక్షంలో మంగళవారం కుదిరిన ఒప్పందం ప్రకారం కార్మికులకు ప్రస్తుత ఇస్తున్న వేతనంపై సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రోజుకు రూ.30లు, 2026 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మరో రూ.30లు మొత్తం రూ.60 వేతనం పెరుగుతుంది. బోనస్ 8.33 శాతం అక్టోబర్ 15 నాటికి చెల్లించటానికి యాజమాన్యం అంగీకరించింది. ఈఎస్ఐ, పీఎఫ్ లేని కార్మికులందరికీ కవర్ చేయటానికి, బకాయిలు మొత్తం చెల్లించటానికి ఒప్పందం కుదిరింది. చర్చల్లో యాజమాన్యం తరపున అకౌంట్స్ మేనేజర్ శ్రీనాథ్, కాంట్రాక్టర్ శ్రీనివాస్ యూనియన్ తరపున యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, బెజవాడ పద్మ, ఆలీసమ్మ, రంగమ్మ, బేబీ, సుజాత, రాణి, కృప, లక్ష్మి, మోతీ భవాని, కోటేశ్వరరావు, సత్యవతి, సావిత్రి పాల్గొన్నారు.

ఏలూరు అడిషనల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు అడిషనల్ కమిషనర్‌గా డి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. గుంటూరు నగరపాలక సంస్థలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు బదిలీల్లో భాగంగా ఇక్కడికి రానున్నారు. ఏలూరు అడిషనల్ కమిషనర్‌గా పనిచేసిన జి.చంద్రయ్య రిటైర్డ్ అయ్యారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నగీనా సుల్తానా బేగం తాడేపల్లిగూడెం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ అసిస్టెంట్ కమిషనర్ పోస్టు గత కొంత కాలంగా ఖాళీగా ఉంది.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ఏలూరు(మెట్రో): విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో జీవించేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. బధిరుల సంకేత భాషా దినోత్సవ వేడుకలు ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశపు హాలులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కేకు కట్ చేశారు. ముఖ్యఅతిథి కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భాష ఏదైనా భావ వ్యక్తీకరణ ప్రధానమన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఉత్తమ జీవన ప్రమాణాలతో జీవించేందుకు అమలవుతోన్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ సందేశాన్ని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఒకరు బధిరులకు అర్థమయ్యే సౌంజ్ఞలతో (సైగలతో) వివరించారు. ఈ సందర్భంగా బధిరులకు స్మార్ట్ ఫోన్‌లను కలెక్టర్ అందించారు. బధిరుల సంక్షేమానికి విశేష సేవలు చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను దుశ్శాలువా, మెమెంటోలతో సత్కరించారు. జెడ్పీసీఈఓ శ్రీహరి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్ కుమార్, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సెక్షన్‌లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొక్కిరాయలంక, పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, పెదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు రూరల్ మండల అసిస్టెంట్ ఇంజినీర్ నరసయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిఘా 'నేత్రం'.. నేర పరిశోధనలో కీలకం

- సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి
- పోలీస్ స్టేషన్లు సైతం నిఘా నీడలో
- పలు కేసుల ఛేధనలో సీసీ కెమెరాలే సాక్ష్యాలు

ఏలూరు టౌన్: నీతి, న్యాయం, ధర్మాలను కాపాడే కనిపించని నాలుగో సింహం పోలీసులకు, వాటిని రక్షించడంలో పోలీసుల అమ్ములపొదిలో ఇటీవల కాలంలో చేరిన గొప్ప ఆయుధం సీసీ కెమెరా. సమాజంలో జరిగే హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, దాడులు, దౌర్జన్యాలు లాంటివి ఎక్కడ జరిగినా వాటిని కనిపెట్టడానికి సీసీ కెమెరాలు పోలీసులకు మూడో కన్నుగా ఉపయోగపడుతున్నాయి. పోలీసులు వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలే కాకుండా, ప్రైవేటు వ్యక్తులు తమ ప్రాంగణాల్లో, ఇళ్లలో, దుకాణాల్లో ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలు సైతం పోలీసుల నేర దర్యాప్తుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాయి. వేగం పెరిగే ప్రస్తుత కాలంలో నేరాలు కూడా అంతే వేగంగా జరుగుతూ పోలీసులను ఇబ్బందులకు గురిచేస్తున్నా సీసీ కెమెరాలు వారికి సగం భారాన్ని తగ్గిస్తున్నాయనే చెప్పాలి. గతంలో ఏదైనా నేరం జరిగితే దర్యాప్తు చేసేందుకు ఎంతో సమయం పట్టేది. పైగా ఆయా కేసుల్లో నిందితుడు ఆచూకీ తెలుసుకోవడమే పోలీసులకు కష్టంగా మారేది.


పత్తేబాద రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలు


ఫైర్‌స్టేషన్ సెంటరులోని సీసీ కెమెరాలు


జీవీమాల్ సెంటరులోని సీసీ కెమెరాలు

కాని నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేర పరిశోధనలో పోలీసులు ముందడుగు వేస్తున్నారు. నేరస్తుల కదలికలను సైతం ఇట్టే పసిగట్టేందుకు సీసీ కెమెరాలు, నిఘా వర్గాలు కీలకంగా మారుతున్నాయి.

సమస్యాత్మక ప్రాంతాల్లోనూ నిఘా పెట్టాలి

ఏలూరులో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో సుమారుగా 40కుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక నగరంలోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేర పరిశోధనకు దోహదపడుతుంది. నేరస్తులు సైతం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు భయపడే అవకాశం ఉంటుంది.

నిఘా వ్యవస్థ పటిష్టం



ఎస్పీ ఆదేశాల మేరకు నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాం. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. బాధితులకు న్యాయం జరిగేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆయా కేసుల్లో నేరస్తులను పట్టుకునేందుకు సీసీ టీవీ ఫుటేజ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎక్కడా అసాంఘిక శక్తులకు అవకాశం లేకుండా నిఘా పెంచాం. ముఖ్య కూడళ్లలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.

– డి.శ్రావణ్ కుమార్, డీఎస్పీ, ఏలూరు

పుస్తకాల పంపిణీకి శ్రీకారం


సుభాష్ బాబును సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో వివిధ లయన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన 10 వేల నోట్ పుస్తకాలను పేద విద్యార్థులకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ బాబు తెలిపారు. మంగళవారం లయన్స్ జిల్లా 316జీ, ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వన్ డిస్ట్రిక్ట్ – వన్ యాక్టివిటీ అనే నూతన కార్యక్రమాన్ని స్థానికంగా ప్రారంభించారు. సుభాష్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా పేద వర్గాల అభ్యున్నతి కోసం అందించే ప్రతి సహాయాన్ని మన ప్రాంతానికి అందేలా కృషి చేస్తానన్నారు. క్లబ్ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుభాష్ బాబును సత్కరించారు. అతిథులుగా జిల్లా గవర్నర్ ఎస్‌వీవీఎస్ పాపారావు నాయుడు, మల్టిపుల్ కౌన్సిల్ నాయుకులు వీకే పంకజాక్షన్, కాకరాల వేణుబాబు, ప్రథమ, ద్వితీయ ఉప గవర్నర్లు డి.సుబ్బారావు, ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్లు కేవీ కిషోర్ కుమార్, వి.మురళీ మోహనరావు, ఎల్ వెంకటేశ్వరరావు, డి.హేమసుందర్ పాల్గొన్నారు.

పోలీసుల నిర్బంధంపై నిరసన

ఏలూరు (టూటౌన్): జీలుగుమిల్లి మండలంలో ఆయుధ కర్మాగారం పేరుతో బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తున్న ప్రజలపై, ప్రజా సంఘాలపై పోలీసుల నిర్బంధాన్ని, దౌర్జన్యాన్ని నిరసిస్తూ ఏలూరులో వామపక్షాలు మంగళవారం ఆందోళనకు దిగాయి. పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయుధ కర్మాగారం పేరుతో వేలాది ఎకరాల గిరిజన భూములు కొల్లగొట్టేందుకు కార్పొరేట్లు ప్రభుత్వం కుట్రపన్నాయని నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ లింగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సీపీఐ నాయకులు ఆళ్లగడ్డ విజయ మాట్లాడుతూ అమాయకపు గిరిజనులు భూములు కొల్లగొట్టేందుకు ఆయుధ కర్మాగారాన్ని అడ్డుపెట్టుకున్నారని విమర్శించారు. గ్రామాల సభల నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన ర్యాలీ చేస్తున్న జీలుగుమిల్లి మండల ప్రజలపై పోలీసుల చేత దౌర్జన్యం చేయించి, నిర్బంధం విధించడం సరికాదని అన్నారు. గిరిజన భూములకు రక్షణగా ఉన్న చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వం ముందుకు వెళ్లాలని ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుధ కర్మాగార భూసేకరణ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



పాతబస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న నాయకులు

పని గంటల పెంపుపై నిరసన

ఏలూరు (టూటౌన్): పనిగంటలు పెంచుతూ కూటమి ప్రభుత్వం చేసిన చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ రోజుకు 12 గంటల పనిచేయించుకోవచ్చని.. అసెంబ్లీలో సెప్టెంబర్ 19న తీర్మానం చేసిన కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం వంగూరు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, యూనియన్ అధ్యక్షురాలు బెజవాడ పద్మ, కార్యదర్శి ఎం.రంగమ్మ పాల్గొన్నారు.



వంగూరు గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు మంగళవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బావిశెట్టివారి పేట శ్రీ కనకదుర్గాంబ ఆలయంలో దేవాదాయ శాఖ జిల్లా అధికారి కూచిపూడి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనం పలికి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రశాంత వాతావరణంలో ప్రజల్లో ఆధ్యాత్మికత పెంచే విధంగా భక్తి భావంతో నిర్వహించాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేశామన్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు దుశ్శాలువా కప్పి సత్కరించారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆలయ ప్రతినిధులు


బావిశెట్టి వారిపేట కనకదుర్గాంబ


పత్తేబాద కనకదుర్గమ్మ


12 పంపుల సెంటర్ అమ్మవారు


దత్తాశ్రమంలోని రాజరాజేశ్వరి దేవి

ఆక్వా చెరువుల ఆన్‌లైన్ పూర్తి చేయాలి

దెందులూరు: మండలంలోని ఆక్వా చెరువులను నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో మత్స్యశాఖ అధికారులు, రైతులతో కలిసి ఆక్వా చెరువులను ఆమె పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఏపీ రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ యాక్ట్‌ను అనుసరించి జిల్లాలోని ఆక్వా చెరువుల వివరాలను నిర్దేశించిన సమయంలోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 26582 ఆక్వా చెరువులున్నాయని, వాటి విస్తీర్ణం, యజమాని పేరు, ఆక్వా సాగు వినియోగిస్తున్న ఎరువులు ఆక్వా కల్చర్ యాప్‌లో ఇప్పటి వరకు 20,900 పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ డీడీ వి.నరసయ్య, ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజు, మండల మత్స్యశాఖాధికారి ఎ. తీష్‌కుమార్ చౌదరి ఉన్నారు.


వైద్య పరీక్షలపై ఆరా తీస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

జాలిపూడి యూపీ పాఠశాలలో..

స్వస్థ్ నారీ, స్వశక్తి పరివార్ అభియాన్‌లో ఏర్పాటు చేసి వైద్యశిబిరాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎంత మందికి పరీక్షలు చేశారని అడగగా 70 మందికి వైద్య పరీక్షలు చేశామని చెప్పారు.

యంగ్ కమ్యూనిటీ చాంపియన్లుగా భార్గవి, నాగార్జున

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన వైస్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సామాజిక సేవా రంగంలో విశేషంగా కృషి చేసిన సైలేడా భార్గవి, నమ్మిన నాగార్జున యంగ్ కమ్యూనిటీ చాంపియన్ అవార్డులను అందుకున్నారు. వీరు పేదలకు, అన్నార్తులకు, విద్యార్థులకు వైస్ సంస్థ ద్వారా కొన్నేళ్లుగా అందిస్తున్న సేవలను గుర్తించి నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ యాక్టివిస్ట్స్ (నిఫా) సంస్థ అవార్డులను ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలోని భారత్ మండపం ప్లీనరీ హాల్లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ ఫౌండేషన్ వేడుకల్లో నిఫా జాతీయ అధ్యక్షుడు ప్రీత్‌పాల్ సింగ్ పన్ను అవార్డుతో పాటు సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.


అవార్డు అందుకుంటున్న భార్గవి

భూసేకరణ వేగవంతం చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఎన్‌హెచ్ 165, గ్రీన్ ఫీల్డ్ హైవే, జీలుగుమిల్లి–పట్టిసీమ, అమరావతి ఓఆర్ఆర్, పెడన–లక్ష్మీపురం 216–హెచ్ రహదారి, పట్టిసీమ–గూటాల రహదారుల భూసేకరణ, నిర్మాణ పనులపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	22
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	30
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు – తిరుపతి	16.00	4830	24

సీఆర్ రెడ్డి కళాశాలలో వర్క్‌షాప్ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ రాంప్ పథకం కింద నిర్వహించే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎస్‌డీపీ) ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ ప్రిన్సిపాల్, ట్రైనింగ్ హెడ్ కె.మురళీ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలు, వ్యవస్థాపక లక్షణాలు పెంపొందించడం ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా మారేందుకు ఈ 20 రోజుల కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇప్పటికే 6 ఈఎస్‌డీపీ వర్క్‌షాపులు ప్రారంభించామన్నారు. పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం నుంచి అందే సహాయంపై అవగాహన కలిగిస్తామని తెలిపారు. పరిశ్రమలు స్థాపించడంపై విద్యార్థుల్లో ఆసక్తి రేకెత్తించి వారిని భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కె.హరి రామ కృష్ణంరాజు, మెకానికల్ విభాగ హెచ్‌వోడీ కె.రాంబాబు, ఈసీఈ హెచ్ఓడీ తేజోమూర్తి, కోఆర్డినేటర్ ఎం శ్రీరామమూర్తి, ఎం రవి కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

26న కేవీఎస్ ప్రతిభా పురస్కార ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన కూచిపూడి నృత్య గురువు, సినీ నృత్య దర్శకుడు కేవీ సత్యనారాయణ జన్మదినం సందర్భంగా కేవీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్నావారికి ఇస్తున్న కేవీఎస్ ప్రతిభా పురస్కారం ఈ ఏడాది తమిళనాడుకు చెందిన మేలట్టూరు భాగవత కళాకారులు ఎస్ నాగరాజన్, ఎస్ అరవింద సుబ్రహ్మణ్యంలకు ప్రదానం చేయనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ కేవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పురస్కారాన్ని ఈ నెల 26న స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించే కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి ముందు సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు కూచిపూడి నృత్య కళా బృందాలచే నృత్య ప్రదర్శన చేస్తారని చెప్పారు. ఈ మేరకు కరపత్రం విడుదల చేశారు. సమావేశంలో హిందూ యువజన సంఘం ఉపాధ్యక్షుడు ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, కేకే గుప్తా, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తిచేయాలి

ఏలూరు(మెట్రో): పేదల ఇళ్లు నిర్దేశించిన సమయంలోగా నిర్మించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం–1 కింద పేదల ఇళ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టరేట్ నుంచి మంగళవారం గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాకు కేటాయించిన 12,345 ఇళ్ల నిర్మాణ లక్ష్యానికి, 10,240 ఇళ్లు పూర్తి చేశారని, మిగిలిన 2105 ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన పెదవేగి, చాట్రాయి, జంగారెడ్డిగూడెం రూరల్ మండల ఇంజినీరింగ్ సిబ్బందిని పనితీరును మెరుగుపరుచుకుని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


కలెక్టర్ వెట్రిసెల్వి